క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే సబితారెడ్డి పర్యటన

కందుకూరు: మండల పరిధిలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ సరిత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నేదునూరులో అమెజాన్ సహకారంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం 11.30 గంటలకు కొత్తగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటుతారన్నారు. 12 గంటలకు కొత్తూర్‌లో అమెజాన్ సహకారంతో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభిస్తారని, ఆయా కార్యక్రమాలకు సకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆమె కోరారు.

సెల్‌టవర్ల నిర్మాణాలను ఆపాలని ఫిర్యాదు



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో ప్రైమ్ ఫర్చ్యూన్ కాలనీలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణాలను ఆపాలని కోరుతూ గురువారం కమిషనర్ రఘుకు ఫిర్యాదు చేశారు. కాలనీ అధ్యక్షుడు జైపాల్‌నాయక్ మాట్లాడుతూ ఇండియన్ టవర్స్ లిమిటెడ్ చెందిన (ఎయిర్‌టెల్) కాలనీ మధ్యలో సెల్‌టవర్స్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. రేడియేషన్ వల్ల పలు క్యాన్సర్ రోగాలు సోకే ప్రమాదం ఉందన్నారు. కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు సెల్ టవర్ నిర్మాణాలు అక్కడ జరుగకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నారు.

సీజనల్ వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోండి

ఎంపీడీఓ సరిత



మాట్లాడుతున్న ఎంపీడీఓ సరిత

కందుకూరు: సీజనల్ వ్యాధులు సోకకుండా సకాలంలో తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సరిత సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపుహాల్‌లో వైద్యులు, సిబ్బందితో సీజనల్ వ్యాధులతో పాటు వాక్సినేషన్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మెదడు వాపు వ్యాధి రాకుండా ఇచ్చే వ్యాక్సిన్లు, స్టాప్ డయేరియా క్యాంపెయిన్ మరియు అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్లపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వారాహి దేవికి ఘనంగా ఆకు పూజ



వారాహి దేవి నవరాత్రుల ఉత్సవాల్లో ప్రత్యేక పూజల్లో భక్తులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠ శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి మందిరంలో శ్రీ వారాహిదేవి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా దేవాలయంలో కుంకుమార్చనలు, శ్రీసౌందర్యలహరి పారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వారాహి దేవికి ఆకుపూజ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో శ్రీ సుబ్రహ్మణేశ్వర హోమం, నాగదోష, కాలసర్పదోష, కుజదోష, నివారణార్థం, శ్రీ వారాహి ప్రత్యేంగిరా సహిత, శ్రీ వల్లీ దేవాసేనా శ్రీ సుబ్రహ్మణేశ్వరస్వామి మంత్ర విశేష హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, విఠల్ శర్మ, సాయి కుమార్ శర్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అభినందనల వెల్లువ

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర బీసీ కో ఆపరేటీవ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నూతి శ్రీకాంత్‌ను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కిడి శివచరణ్‌రెడ్డి గురువారం కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.



సూక్ష్మపోషకాల లోపంతో ఉన్న బీర పంట



బీరలో పాము పొడ తెగులు



పండు ఈగ సోకిన కాకర

సస్యరక్షణ చర్యలతో సత్ఫలితాలు

- జిల్లా క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ
- తీగ జాతి కూరగాయాలతో లాభం
- తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



శ్రీకృష్ణ

కందుకూరు: తీగ జాతి కూరగాయలైన బీర, కాకర, సొర, దొండ మొదలైన పంటలకు మార్కెట్‌లో ఎప్పుడూ ఒక స్థిరమైన ధర ఉంటుంది. దీని కోసం రైతులు ఎక్కువగా ఆ పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఈ మధ్య కాలంలో అనేక రకాల చీడ, పీడలు సోకి పంటలకు నష్టం జరుగుతుంది. తీగ జాతి పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం జిల్లా క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

పండు ఈగ...

తల్లి ఈగలు పూ మొగ్గలపైన, లేత పిందెలపైన గుడ్లు పెడతాయి. వీటి నుంచి వచ్చిన సన్నని నులి పురుగులు కాయ తొలిచి లోపల గుజ్జును తిని నష్టపరుస్తాయి. ఈ పురుగు బీర, కాకర పంటలను ఎక్కువగా ఆశిస్తుంది. దీంతో కాయలు కుళ్లిపోతాయి.

నివారణ...

ఎకరాకు సుమారు 6–10 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలి. పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నివారణకు నోవల్యూరాన్ 1 మిల్లీ లీటర్ లేదా మలాథియాన్ 2.0 మిల్లీ లీటర్ లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటర్‌ను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. వేప నూనె 10,000 పీపీఎం 2 మిల్లీ లీటర్‌ను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయొచ్చు.

పాము పొడ పురుగు...

ఇది చాలా చిన్నగా గొంగళి పురుగులా సన్నగా ఉండి ఆకు పొరలలో చొచ్చుకునిపోయి పత్రహరితాన్ని తిని నష్టపరుస్తుంది. నివారణకు థయోమిథాక్సిమ్ 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్ లేదా డైమథోయేట్ 2 మిల్లీ లీటర్ లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీ లీటర్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

బూజు తెగుళ్లు...

ఆకు అడుగు భాగంలో బూజు మాదిరిగా ఏర్పడి ఊదా రంగుకు మారిపోతాయి. ఆకుపై భాగాన పసుపు రంగు మచ్చలు కనిపిస్తాయి. నివారణకు డైమిథోమాఫ్(అక్రోబాట్) 1 మిల్లీ లీటర్ లేదా రెడోమిల్ ఎంజెడ్ 2.5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.

బూడిద తెగుళ్లు...

ఆకుల పైభాగంలో తెల్లని పొడిలా ఏర్పడి తెగుళ్ల ఎక్కువైనప్పుడు, పూత కూడా వ్యాపిస్తుంది. ఆకులు, కాండం ఎండిపోతాయి. నివారణకు డైనోకాప్(కెరాథేన్) 1 మిల్లీ లీటర్ లేదా అజాక్సోస్ట్రోబిలిన్ 1 మిల్లీ లీటర్ లేదా డైఫెన్‌కోనజోల్ 1 మిల్లీ లీటర్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

వెర్రి తెగులు...

ఆకులలో ఈనెలుండే ప్రాంతంలో చారలు ఏర్పడతాయి. పొదు అంతా గిడసబారి, పూత తగ్గుతుంది. ఇలాంటి మొక్కలను వెంటనే గుర్తించి నాశనం చేయాలి. నివారణకు డైమిథోయేట్ 2 మిల్లీ లీటర్ లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఎండు తెగులు...

తీగ, పూత, కాత సమయంలో నిలువునా ఎండిపోతాయి. నేల నుంచి బ్యాక్టీరియా ఆశించి ఎండు తెగులు వస్తుంది. నివారణకు కాపర్‌ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు+స్ట్రెప్టోసైక్లిన్ 0.1 గ్రాము ఒక లీటర్ నీటికి కలిపి పాదులు తడిసేలా నేలలో పోయాలి.

వైరస్ తెగుళ్లు...

తీగ జాతి కూరగాయల్లో వైరస్ తెగుళ్లు ఎక్కువగా ఆశించి ఆకులు ముడుచుకుపోయి, పూత పిందె రాకుండా గిడసబారినట్లు ఉంటాయి. వైరస్ వ్యాప్తి, రసంపీల్చే పురుగులైన తెల్లదోమ, పచ్చదోమ, పేనుబంక, తామర పురుగుల ద్వారా జరుగుతుంది. రసం పీల్చే పురుగుల నివారణకు థయోమిథాక్సిమ్ 0.3 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్ లేదా అసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పసుపు, నీలం రంగు జిగురు పేపర్లు ఎకరాకు 10–20 వరకు పెట్టాలి. 10 రోజులకోసారి వేప నూనె 10,000 పీపీఎంను 2 మిల్లీ లీటర్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సూక్ష్మపోషకాల లోపంతో పిందెలు కుళ్లిపోతాయి. నివారణకు మ్యాక్స్ లేదా విపుల్ లేదా గ్రోత్‌ను 3 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. మోతాదుకు మించి ఎక్కువ నీరు పెట్టడం లేదా సస్యరక్షణకు మందులు అధికంగా వాడటంతో పంటపై తీవ్ర ప్రభావం ఉంటుంది. అందుకోసం అవసరానికి అనుగుణంగా సేద్యపు పద్ధతులను పాటించాలి.

సమస్యలు పరిష్కరించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుడాకాంప్లెక్స్: డివిజన్ పరిధిలోని కాలనీల్లో రోడ్లు గుంతలమయమై ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, భగత్‌సింగ్‌నగర్, శంకర్‌నగర్, హుడా కాలనీల్లో కమ్యూనిటీ హాల్, మహిళా భవన్‌లకు గతంలోనే నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదని కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం జోనల్ కమిషనర్ హేమంత్‌పాటిల్‌కు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు దోమలతో ఇబ్బంది పడుతున్నారని, డెంగీ లాంటి విషజ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అదేవిధంగా దోమల నిర్మూలనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బోయిని మహేందర్‌యాదవ్, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, బేర బాలకిషన్, అరుణ, యూసుఫ్, కడారి యాదయ్యయాదవ్, నర్సింగ్‌రావు, నర్సింగ్‌యాదవ్, సంగీత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేస్తాం

జోనల్ కమిషనర్ హేమంత్‌పాటిల్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని జింకలబావి కాలనీ, విజయపురి కాలనీల్లో ఎల్‌బీనగర్ ఈస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ పాటిల్‌తో పాటు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుజాత, శానిటరీ డిపార్ట్‌మెంట్ డీఈ నీలిమ, స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిలు గురువారం పర్యటించారు. జేబీ కాలనీలో వర్షపునీటి నాలా, విజయపురి కాలనీలో మురుగునీటి నాలా, పోచమ్మబాగ్ ప్రభుత్వ పాఠశాల వద్ద రోడ్డు, భగత్‌సింగ్‌నగర్ జీడీ పాయింట్ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శానిటేషన్ పనులు అధ్వానంగా ఉన్నాయని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మ్యాన్‌హోల్ మూతలు ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. కాలనీవాసులకు సత్వరమే ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని అందించడానికి క్షేత్ర పర్యటన చేశామని ఆమె తెలిపారు.



ధ్వంసమైన మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న హేమంత్ పాటిల్

‘దందా’ చేసే మిల్లులపై చర్యలు



బియ్యం లారీని తనిఖీ చేస్తున్న అధికారులు, పోలీసులు

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్

మహేశ్వరం: రేషన్ దందా చేసే మిల్లులపై చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని పలు రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రైస్ మిల్లర్లు రేషన్ బియ్యాన్ని కొని, అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు అమ్ముకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. మహేశ్వరంలోని రైస్ మిల్లుల్లో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు ఇలాగే రేషన్ దందా కొనసాగిస్తే పీడీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమని ఆయన హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ముఖ్యమంత్రికి సత్కారం



ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: తెలంగాణ స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా చల్లా నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో టీయూఎఫ్‌ఐడీసీ చైర్మన్ పదవికి ఎంపిక చేసినందుకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తానని ఆయన తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు కాంగ్రెస్ అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కందుకూరు: పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు సిద్ధూ పేర్కొన్నారు. ఈ నెల 22న ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి విద్యార్థులు భారీగా తరలి రావాలని కోరుతూ గురువారం కళాశాలల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యుడు సిద్ధూ మాట్లాడుతూ... నూతన ప్రభుత్వం ఏర్పడి 7నెలలు గడుస్తున్నా విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికీ విద్యాశాఖకు మంత్రిని నియమించలేదన్నారు. ఆరేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వంశీ, ప్రభాకర్, కార్తీక్, బన్నీ, గణేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పూరీ జగన్నాథ రథయాత్ర



ఆమనగల్లుకు చేరిన ఇస్కాన్ టెంపుల్ రథం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈనెల 12న హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో పూరీ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు రథయాత్ర నిర్వాహకులు పాపిశెట్టి రాము, తల్లోజు వెంకటయ్య, వీరబొమ్మ రామ్మోహన్, ముక్కరి కృష్ణయ్యలు తెలిపారు. గురువారం వారు విలేకరుల మాట్లాడుతూ.. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల భక్తుల ఆధ్వర్యంలో పూరీ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పట్టణంలోని అయ్యప్పకొండ నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని, జాతీయ రహదారి గుండా మార్కండేయ దేవాలయం మీదుగా కన్యకాపరమేశ్వరీ దేవాలయం వరకు రథయాత్ర కొనసాగుతుందని వివరించారు. అనంతరం కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో పూజలు, ప్రవచనాలు ఉంటాయని చెప్పారు. రథయాత్రలో ఇస్కాన్‌టెంపుల్ ప్రెసిడెంట్ మార్గింగ్ ప్రభు, ఆర్ట్ ఆఫ్ రిలాగ్జేషన్ ట్రస్ట్ చైర్మన్ విజయప్రతాప్ మహారాజ్ పాల్గొంటారని వారు చెప్పారు. రథయాత్రలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఇస్కాన్‌టెంపుల్ రథం గురువారం సాయంత్రం ఆమనగల్లుకు చేరుకుంది. స్థానిక మహిళలు రథానికి పూజలు చేసి స్వాగతం పలికారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

దిల్‌సుఖ్‌నగర్: పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీలల్లో శ్రీరామకృష్ణపురం కాలనీ, హరిపురి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పలు సమస్యలను దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నేత, బండి మధుసూధన్ రావు, సురేంద్ర కుమార్, నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దవూర సైదులు, మహేందర్, వంగాల శ్రీకాంత్ రెడ్డి మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్షయపాత్రకు అప్పగించొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్ : మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థ అక్షయపాత్రకు అప్పగించ వద్దంటూ మండలంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం వంట చేసే మహిళలు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం మొదలయినప్పటి నుంచి గ్రామాల్లోని డ్వాకా గ్రూపుల మహిళలు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ఎలాంటి జీతభత్యాలు లేకుండా సేవాదకృథంతో పాఠశాల పిల్లలకు వంట చేసి పెడుతున్నారు. 23 ఏళ్లుగా నష్టాలను భరిస్తూ వంట చేసి పెడుతున్న కార్మికులను పక్కన పెట్టి.. ప్రభుత్వం మా పొట్ట కొట్టి స్వచ్ఛంద సంస్థ అయిన అక్షయపాత్రకు అప్పగించాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వ ర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మండల కన్వీనర్ నర్సింహా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, మంజుల లక్ష్మమ్మ, రమాదేవి, పుష్ప, అలివేలలు, నాగరాణి, మంగ, ఇందిరా, రాములమ్మ, లలిత పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్లాస్టిక్ భూతం!

- పర్యావరణానికి పెనుముప్పుగా ప్లాస్టిక్
- అధికారుల తనిఖీలు.. ఆ తరువాత షరా మమూలే!
- ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తున్న ప్లాస్టిక్ వాడకం
- పట్టించుకోని ఉన్నతాధికారులు
- యథేచ్ఛగా కవర్ల అమ్మకం



ప్రధాన రహదారులపై పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు

దిల్‌సుఖ్‌నగర్: పర్యావరణానికి ప్లాస్టిక్ అతి ప్రమాదకరంగా మారుతోంది. ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణాలను గుర్తించి పలు సందర్భాల్లో న్యాయస్థానం, జీహెచ్‌ఎంసీ అధికారులు దుకాణాలు, వ్యాపార సంస్థలకు హెచ్చరికలు జారీ చేసినా అవి కొన్ని రోజులకే మాత్రమే పరిమితమవుతున్నాయి. అధికారులు తనిఖీలు చేసిన సందర్భాల్లో కొన్ని రోజులు పాలిథిన్ బ్యాగులను వాడి ఆ తరువాత అంతా షరా మమూలే అన్నట్లు విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా దుకాణాలు, షాపింగ్‌మాల్స్ నిర్వాహకులతోపాటు ఇతర వ్యాపారస్తులు వస్తువులను ప్యాక్ చేయడానికి ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లకే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో దుకాణానికి వెళ్లి ఏ చిన్న వస్తువు తీసుకున్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు తప్పనిసరిగా మారింది.

- మలక్‌పేట్‌జోన్ పరిధిలోని చిన్న దుకాణాల నుంచి పెద్దపెద్ద మాల్స్‌లలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను విచ్చలవిడిగా వాడుతున్నారు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వాడకం యథేచ్ఛగా కొనసాగుతోంది. గతంలో న్యాయస్థానం, జీహెచ్‌ఎంసీలు ప్రజారోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను అరికట్టాలని ఉత్తర్వులు జారీ చేసినా నగరంలో ఏ మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. మలక్‌పేట్, సరూర్‌నగర్, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలో ప్లాస్టిక్ నిషేధంపై ఇప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. క్యారీ బ్యాగుల్లో సరుకులను అందజేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగదారుల పాలిట పెను శాపంగా మారుతుంది. కిరాణ దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, మటన్, చికెన్ షాపులలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వివిధ రంగులలో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.
- సర్కిల్ పరిధిలో వాడి పాడేసిన క్యారీ బ్యాగులను రీసైకిల్ పేరుతో వాటిని తిరిగి వివిధ రంగులలో మార్కెట్లో వదులుతున్నారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు అతి ప్రమాదకరం అని తెలిసినా హోటళ్లు, రెస్టారెంట్లు ఆహార పదార్థాలను క్యారీ బ్యాగుల్లోనే ప్యాక్ చేసి ఇస్తున్నారు. ఆ ఆహారం తినడం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం అధికంగా ఉందని ప్రముఖ వైద్యులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో మా ర్పు రావడం లేదు. దుకాణాలు, మాల్స్‌లలో వస్తువులను తీసుకెళ్లిన తరువాత ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లను రోడ్లమీద, మురికి కాలువల్లో, చెరువులు, ఖాళీ స్థలాలు, ప్రధాన రహదారులవెంట వేయడం వల్ల పర్యావరణానికి పెన్నుముప్పుగా మారుతుందని స్వచ్ఛంద సంస్థలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నాలాలలో చిక్కడం వల్ల వర్షాకాలంలో డ్రైన్లు పొంగి కాలనీలలోకి నీరు చేరుతుంది. ఒక ప్లాస్టిక్ క్యారీ బ్యాగు భూమిలో కలవాలంటే లక్షల సంవత్సరాలు పడుతుంది. అవి భూమిలో చేరడం వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి.
- వర్షాకాలంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు కాలువల ద్వారా చెరువులు, కుంటలలో చేరి చేపల మనుగడను దెబ్బతీస్తున్నాయి. నగరంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను పారిశుద్ధ్య సిబ్బంది ఎక్కడ పడితే అక్కడ వేసి కాల్చడం వల్ల క్యారీ బ్యాగులు కాలిపోయి డయాక్సిన్ ఇతర విష వాయువులు గాలిలో కలసి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. దీనివల్ల ప్రజలు అనారోగ్యాల బారినపడే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలు ప్రజలు గుర్తించకపోవడంతో క్యారీ బ్యాగుల వాడకం నగరంలో రోజురోజుకూ పెరుగుతుందే తప్ప తరగం లేదు. ప్రజల్లో దీనిపై సరైన అవగాహన లేకపోవడం, అధికారుల నిర్లక్ష్యం వల్ల క్యారీ బ్యాగులకు అడ్డుకట్ట పడడం లేదు. ఇప్పటికైనా అధికారులు నగరంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని నిషేధించి వాటివల్ల భవిష్యత్తులో జరిగే పరిణామాలను నివారించాలని పలువురు పర్యావరణ నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.